క్లుప్తంగా

వీధి కుక్కల ఏరివేత



ఇందిరానగర్‌లో కుక్కలను పట్టుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో జీవీఎంసీ వెటర్నరీ అధికారులు చర్యలు చేపట్టారు. గోపాలపట్నం, ఇందిరానగర్ ప్రాంతాల్లో శుక్రవారం సిబ్బంది వీధుల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని వ్యానులో తరలించారు. అయితే 89వ వార్డులో పిచ్చికుక్కలు తిరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. వాటిపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఘనంగా హీరో కృష్ణ జయంతి



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు మేహాద్రి గెడ్డ కాలనీలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బల్ల రమణ కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమకు కృష్ణ కొత్త భాష్యాన్ని అందించారన్నారు. కార్యక్రమంలో పి. రాజేష్, రమణ, వై. నాగరాజు, పిసాయి, శ్రీను, ఉమ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ముగిసిన సమ్మర్ క్యాంప్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో నెల రోజులుగా అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో ముగింపు వేడుకలు నిర్వహించారు. డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా సమ్మర్ క్యాంప్ ఉంటుందని, దీనిని నిర్వహించిన ఈకార్వోను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన చిన్నారులకు డీఆర్ఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

సింహాచలం దేవస్థానం నమూనాతో..

- రూ.9.98 కోట్లతో సింహాచలం రైల్వేస్టేషన్ అభివృద్ధి
- చకచకా పనులు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు



సింహాచలం రైల్వే స్టేషన్ నమూనాను వివరిస్తున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ (ఫైల్)

గోపాలపట్నం: గోపాలపట్నంలోని సింహాచలం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రిజర్వేషన్ భవనం పక్కనే ఈ ఆధునికీకరణ పనులు చేపట్టారు. రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులకు ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శంకుస్థాపన చేసిన విషయం విదితమే. రైల్వే స్టేషన్ విస్తరించడమే కాకుండా గోపాలపట్నం, చంద్రనగర్ రెండు వైపులా రాకపోకలు సాగించే విధంగా ప్రవేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

శిల్పుల సహకారం

సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులను ఆకట్టుకునేందుకు సింహాచలం దేవస్థానం నమూనాతో రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తున్నారు. ఇందుకు స్థానిక శిల్పుల సహకారం తీసుకుంటున్నారు. రెండు వైపులా రహదారుల విస్తీర్ణం పెంచనున్నారు. స్టేషన్‌లో ప్రయాణికులతో పాటు భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించేదిశగా ప్రణాళిక రూపొందించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

ఇతర రాష్ట్రాలు, సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వస్తుంటారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో అవి ఆగకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సింహాచలం పేరుతో ఉన్న ఈ రైల్వే స్టేషన్‌లో భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు ఇలా

- స్టేషన్‌కు రెండువైపులా కలిపే విధంగా 12 మీటర్ల విస్తీర్ణంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం
- ప్రయాణికులు వేచి ఉండే గదిని విస్తరించనున్నారు.
- ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు
- సింహాచలం వెళ్లే వారి కోసం క్లోక్ రూమ్ ఏర్పాటు
- కొత్తగా బుకింగ్ కమ్ ఎంక్వైరీ కార్యాలయం
- కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్‌కు విశాలమైన పార్కింగ్ ఏరియా ఏర్పాటు
- రిఫ్రెష్‌మెంట్ గదులు
- ఆధునిక మరుగుదొడ్లు వంటి పలు సౌకర్యాలు కల్పించనున్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందితే ఎంతో మేలు



సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందితే ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు కలుగుతుంది. భక్తుల రద్దీ పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గోపాలపట్నానికి సింహాచలం రైల్వే స్టేషన్ తలమానికంగా మారనుంది.

– గొంతిన నాగరాజు, వెంకటాపురం

మా ప్రాంతాలకు మహర్దశ



రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందితే మరుగున ఉన్న మా ప్రాంతానికి గుర్తింపు వస్తుంది. అండర్ పాస్‌వే కూడా నిర్మాణం పూర్తి కావస్తోంది. ఇపుడు సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. కొత్తపాలెం, చంద్రనగర్, నరవ వంటి మా ప్రాంతాలకు మహర్దశ కలుగుతుంది.

– పాలమరౌట్టి విజయ్, చంద్రనగర్

ఎక్కువ రైళ్లు ఆపాలి



ఎక్కువ రైళ్లు ఆగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎప్పటి వరకు పాసింజర్లు కొన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. మరిన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగితే అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే వారికి వెసులుబాటుగా ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్ ఫాస్టర్ రైళ్లు ఆపాలి.

– దేరుడ్ల సత్యనారాయణ, బుచ్చిరాజుపాలెం

భూగర్భ జలాల పరిరక్షణకు కృషి చేయాలి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- శాంతినగర్‌లో ఇంకుడు గుంతలకు శ్రీకారం



ఇంకుడు గుంత తవ్వుతున్న శ్రీధర్

విశాఖ విద్య: భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్ పార్కు ఆవరణలో ఆయన స్వయంగా ఇంకుడు గుంత తవ్వారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రోజు రోజుకు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. వీటిని సంరక్షించుకుంటేనే భావి తరాలకు నీరు లభ్యమవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జల సంరక్షణకు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంత తీస్తే నీరు తిరిగి భూమిలోకి వెళ్లి జల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ఈఆర్ డబ్ల్యూఎస్ పెద్దలు ఉదయ్, డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి, ఎం. దుర్గాప్రసాద్, జోనల్ కో-ఆర్డినేటర్ శేషగిరిరావు, శాంతినగర్‌పార్కు పాలక వర్గ సభ్యులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఈటి సత్యనారాయణ, దామోదర్ రావు, జియ్యాని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష తగదు



నిరసన తెలుపుతున్న గొల్లమాల అప్పారావు, దళిత సేన నాయకులు

కంచరపాలెం: దళితులపై వివక్ష చూపడం అమానుషమని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సిద్దిపేటలో జరిగిన కుల వివక్ష ఘటనపై శుక్రవారం కంచరపాలెం దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు హనుమాన్ మాల ధరించి గుడిలో పూజ చేయడానికి వెళ్లగా.. అగ్ర కులస్తులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. సీతారామ్‌పల్లిలో అగ్ర కులస్తులు దళితులను తక్కువ కులస్తులంటూ దూషించడం.. యావత్ భారతదేశం తలదించుకునేలా ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అప్పారావు కోరారు. కార్యక్రమంలో సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతలా మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీ, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

లలితా పీఠంలో చండీ హోమం

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో వైశాఖ మాసం, బహుళ అష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం చేసినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

గొప్ప నాయకురాలు తులసి



తులసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

సింథియా: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విశాఖ జిల్లా (సీఐటీయూ అనుబంధ) అధ్యక్షురాలు తులసి మృతికి శుక్రవారం మల్కాపురం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని అంగన్‌వాడీ భవనంలో ఆమె చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. మహిళల ఆర్థిక అవసరాలు తీర్చే క్రమంలో తులసి ప్రతి ఒక్కరికి అండగా ఉండేదని గుర్తు చేసుకున్నారు. సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు అండగా ముందుండి పోరాటాన్ని నడిపిన ఘనత ఆమెకే దక్కిందని కొనియాడారు. ఆమె హఠాన్మరణం యూనియన్‌కే కాకుండా విశాఖ కార్మిక ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ నాయకురాలు ఆర్.విమల, సంఘ సభ్యులు భారతి, ఈశ్వరి, దాక్షాయిని, పైడికొండ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయడం అన్యాయం’



దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయాలని చూడడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు కె.గంగారాం అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1205వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఉత్పత్తులు మెరుగుపడినా నేటికీ జీతాలు చెల్లించకుండా జాప్యం చేయడం కార్మికులను, వారి కుటుంబ సభ్యులను వేధించడమే అవుతుందన్నారు. కార్మికులు, ఉద్యోగులు ప్రతీ నెలా ఈఎంఐలు చెల్లించాల్సి ఉందని, ఈ విషయంలో కార్మికుల్ని డిఫాల్టర్లుగా చేసి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్న యాజమాన్యం తీరు మార్చుకోవాలని కోరారు. గోవింద్, బొంజుబాబు, సుమన్, వైకుంఠరావు, కృష్ణమోహన్, ఆలీషా, ఈశ్వర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉక్కు ఈఎస్అండ్ఎఫ్, సేఫ్టీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సత్కారం



పదవీ విరమణ చేసిన ఉద్యోగిని సత్కరిస్తున్న డాక్టర్ సన్యాసిరావు



మజ్జి ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురు అటెండర్లను సంస్థ అధికారులు శుక్రవారం సన్మానించారు. సంస్థలో ఒ.నారాయణరావు, ఇ.అప్పలరాజు, నూరమ్మ అటెండర్లుగా ఉద్యోగం చేసి శుక్రవారం విరమణ పొందారు. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు వీరి సేవలను కొనియాడారు. ముగ్గురిని సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పలు హోదాల్లో పని చేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన 15 మంది ఉద్యోగులను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీడీ ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి. పద్మజ, ఏపీ ఎంఈఎస్ఏ కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు, జెమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజ్జి సేవలు చిరస్మరణీయం

పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో 39 ఏళ్లుగా సేవలందించి శుక్రవారం పదవీ విరమణ చేసిన మజ్జి ప్రసాద్‌ను ఉద్యోగులు సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ గణపతిరావు, ఈఈలు కామేశ్వరరావు, సుగుణాకరరావు, రామకృష్ణారావు, మహేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంఙధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

16 నుంచి మోదకొండమ్మ పండగ

- ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: భక్తుల కొంగుబంగారమైన గోపాలపట్నం మోదకొండమ్మ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 18 వరకూ నిర్వహించనున్నట్టు గాయత్రీ గ్రూప్ అధినేత కేవీ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలతో కలిసి శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోపాలపట్నం పరిసర ప్రాంతాలకు ఆరాధ్య దైవంగా మోదకొండమ్మ విరాజిల్లుతోందన్నారు. నాయకుడు గొర్లె అప్పలస్వామి నాయుడు మాట్లాడుతూ గోపాలపట్నం ఇందిరానగర్‌లో వెలసిన అమ్మవారు మహిమ గలదన్నారు. పండగ మహోత్సవాల్లో అందరూ పాలు పంచుకోవాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లూరి తవుడు మాట్లాడుతూ 18న ప్రధాన పండగ జరుగుతుందన్నారు. ప్రధాన పండగ రోజు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నాయకులు, దాతలు శరగడం సురేష్, బురెడ్డి గోపి, గుణిశెట్టి శ్రీనవాసరావు, రాజమండ్రి సిల్క్స్ యజమాని ముఖలింగం, నారిపిన్ని సత్తిరాజు, సాయి తేజ, అప్పారావు, మళ్ల సతీష్, ఆలయ కమిటీ సభ్యులు కోనేటి నూక రాజు, నానేపల్లి జయశంకర్, రాము తులసీరావు, ఆలేటి సూరి బాబు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ తరగతులు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

దాబాగార్డెన్స్ : స్నేహాంజలి ఆర్ట్స్ అసోసియేషన్ (విశాఖపట్నం), నృత్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్యాన్సెస్ (హైదరాబాద్) సంయుక్తంగా నిర్వహించిన వేసవి నృత్య శిక్షణ తరగతులు (మోహిని అట్టం) శుక్రవారంతో ముగిసాయి. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మోమిత పల్(కోల్‌కతా), కూచిపూడి కళాకారిణి, అంజన రాజపక్ష స్మృతి పురస్కార గ్రహీత ఇందిర పరశురాంచే శిక్షణ పొందిన పిల్లల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముగింపు కార్యక్రమంలో డాక్టర్ జాలాది విజయ, సింగిడి సాంస్కృతిక సంస్థ గౌరవ అధ్యక్షురాలు రాయవరపు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా జీవిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న ముకుందరావు తదితరులు

ఏయూక్యాంపస్: ప్రతి వ్యక్తి పర్యావరణహితంగా జీవించడం అలవరచుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పి.వి.ముకుందరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ తమ కర్తవ్యంగా భావించినపుడే పూర్తిస్థాయిలో ఫలితాలు వస్తాయన్నారు. ఈ ఏడాది మన భూమి నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తి 10 మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం బాధ్యతగా స్వీకరించాలని కోరారు. విశాఖను ఒక సామాజిక వనంగా మార్చు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలు పెంచాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.ఎస్.ఆర్.సి.మూర్తి మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలు పండించే వారికి ప్రోత్సాహం అందించడం అవసరమన్నారు. ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు స్ఫూర్తిని ఇవ్వడం, తెలియజేయడం, అమలు చేయడం ద్వారా పర్యావరణ సంరక్షణలో భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. సమత కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు రాజీ ప్రవీణ, గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం, కళాశాల అధ్యాపకులు శ్రీదేవి, యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి కృష్ణకుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు



సీట్లు పొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న రూపవతి

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారని, ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్ రూపవతి చైర్మన్‌గా వ్యవహరించారని మేహాద్రి గెడ్డ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ మృదుల ప్రియదర్శిని తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 7 మహిళా గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్ స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. జిల్లలో మేహాద్రి గెడ్డ, సీవోఈ మధురవాడ, నక్కపల్లి, కోనాం తాళ్లపాలెం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి గురుకులాల్లో 73 సీట్లను గాను సుమారు 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ ఖాళీలు మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా భర్తీ చేశారు. పలు గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ జి.గ్రేస్, టి నాగమణి, కె.సువర్ణ రత్న కుమారి, సీహెచ్ హిమవతి కమిటీ సభ్యులుగా వ్యహరించారు.

డాక్టర్ బాబ్జీకి బాల సాహిత్య సేవారత్న అవార్డు



డాక్టర్ వరప్రసాద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న డాక్టర్ బాబ్జీ

మద్దిలపాలెం: మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సేవారత్నం అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఏల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి చేతులమీదుగా శుక్రవారం ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తనకు ప్రతిష్టాత్మక పురస్కారం అందించిన సారస్వత పరిషత్ ప్రతినిధులకు డాక్టర్ బాబ్జీ కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు చెందిన వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.